

ద్వితీయ బహుమతి అందుకుంటున్న వనజాక్షి



ముగ్గులను తిలకిస్తున్న మాజీ కార్పొరేటర్లు, న్యాయ నిర్ణేత అరుణ అశోక్



విజేతలను ఎంపిక చేస్తున్న అతిథులు



ప్రమీలకు ప్రథమ బహుమతి అందజేస్తున్న తూము శ్రావణ్‌కుమార్, బాబూరావు



దివ్యాంగురాలు సుప్రియకు కన్సొలేషన్ బహుమతి అందజేస్తున్న దృశ్యం



మూడవ, నాలుగవ బహుమతులను అందుకుంటున్న మమత, గ్రీష్మ



# అలరించిన రంగవల్లులు

- అందమైన ముగ్గులు వేసిన మహిళామణులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దివ్యాంగురాలి ముగ్గు

## 'సాక్షి' ముగ్గుల పోటీలకు విశేష స్పందన



మూసాపేట: 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలో మగువలు మురిపించేలా రంగురంగుల ముత్యాల ముగ్గులను తీర్చిదిద్దారు. సంక్రాంతి సంబురాలను చాటి చెప్పేలా గొబ్బెమ్మలు, చెరుకుగడలు, రైతులను కీర్తిస్తూ, తెలుగువారి మనస్సాక్షి 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలుపుతూ వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి.బుధవారం మూసాపేటలోని కేపీయం గ్రౌండ్‌లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో దాదాపు 100 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులతో పాటు 15 కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మూసాపేట మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్‌కుమార్, పగడాల బాబూరావులు ముగ్గులను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. 'సాక్షి' కూకట్‌పల్లి జోన్ ఇన్‌చార్జి తొట్ల పరమేష్, పంచశీల స్కూల్ కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, సాయి విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సిహెచ్. ప్రభాకర్ గౌడ్ కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు శ్రీ సాయి అలేఖ్య సంఘసేవా సంస్థ వ్యవస్థాపకురాలు అరుణ అశోక్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. తమ సంస్థ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులను అందజేశారు. బోయిన్‌పల్లి నుంచి వచ్చిన ప్రేమ సంక్రాంతి అమ్మవారిని ప్రతిభింబించేలా సంక్రాంతి పండుగను తలపిస్తూ వేసిన ముగ్గుకు ప్రథమ బహుమతి లభించింది. రైతు లేకపోతే ఆహారం లేదు, భవిష్యత్తు లేదు అంటూ వేసిన ముగ్గుకు వనజాక్షికి ద్వితీయ బహుమతి లభించింది. తృతీయ బహుమతి మమత, చతుర్థ బహుమతి గ్రీష్మను వరించాయి.



పుట్టుకతోనే చెవుడు, మాటలు రాని ఓ సుప్రియ అనే మహిళ సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా వేసిన ముగ్గు అందరినీ ఆకట్టుకుంది. ధైర్యంగా పోటీల్లో పాల్గొన్నందుకు సుప్రియకు ప్రత్యేక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో 'సాక్షి' కూకట్‌పల్లి జోన్ బృందం, నాయకులు పాల్గొన్నారు.



విజేతలతో ముఖ్య అతిథులు, న్యాయ నిర్ణేతలు

### మొదటి సారి పాల్గొన్నా..



ముగ్గుల పోటీలో పాల్గొనటం మొదటిసారి. 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు అద్భుతంగా నిర్వహించారు. మొదటిసారి కావడంతో ముగ్గు వేసేందుకు కొంచెం భయం వేసింది. అందరిని చూసి నాలో ఉత్సాహం కలిగింది. తిరిగి ఎక్కడైనా ముగ్గుల పోటీ నిర్వహిస్తే పాల్గొని ప్రశంసలు అందుకుంటాను.

– చరిష్మా, మూసాపేట

### సంతోషంగా ఉంది



'సాక్షి' నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొనటం సంతోషంగా ఉంది. చిన్నప్పటి నుంచి ముగ్గులు వేయడమంటే ఎంతో ఇష్టం. ముగ్గుల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పడమే కాకుండా అందులో సైన్స్ కూడా ఉందని మా అమ్మమ్మ చెప్పేది.

– శిరీష, ప్రగతినగర్

### నాలో ఉత్సాహం పెరిగింది



'సాక్షి' దినపత్రిక మూసాపేటలో ముగ్గుల పోటీ నిర్వహించటం సంతోషంగా ఉంది. ఈ ముగ్గుల పోటీలో పాల్గొని అందరూ వేస్తున్న రంగు రంగుల రంగవల్లులను చూస్తే నాలో మరింత ఉత్సాహం పెరిగింది. నేను వేసిన ముగ్గుకు తప్పకుండా బహుమతి పొందాలన్న ఉద్దేశంతో మంచి ముగ్గు వేయటానికి ప్రయత్నించాను.

–షర్మిల, మూసాపేట

---

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: పవర్‌నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శివశక్తి నగర్, జనతానగర్ వార్డు కార్యాలయం, మారుతినగర్, టి. అంజయ్యనగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేపీహెచ్‌బీ 15వ ఫేజ్, 4వ ఫేజ్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, ఎస్‌ఐలు మురళీ, హుసేన్ నాయక్, ఆర్‌ఐ శేఖర్, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీ శివరామాంజనేయ దేవాలయంలో..

మోతీనగర్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళశాసనం, పట్టు దీపోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహికంగా దీపాలను వెలిగించి శ్రీవారికి సామూహిక హారతి ఇచ్చారు. కబీర్‌నగర్‌లోని శ్రీ శివ రామాంజనేయ దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి విశేష మంగళహారతులు ఇచ్చారు.



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక హారతి ఇస్తున్న మహిళా భక్తులు

## అల్లాపూర్ డివిజన్‌లో మేయర్ పర్యటన



అల్లాపూర్ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, అధికారులు

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్ అల్లాపూర్ సర్వే నెంబర్ 18లో బుధవారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, జీహెచ్‌యంసీ ఇంజినీరింగ్, జలమండలి, శానిటేషన్, యూబీడీ, ఎంటమాలజీ, జీహెచ్‌యంసీ వీధి లైట్లు, ఎలక్ట్రిసిటి తదితర విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్ ఈ బ్లాక్‌లో డ్రైనేజీ, మంచినీటి సరఫరా, సీసీ రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. రాజీవ్ గాంధీ, సఫ్దార్‌నగర్ మధ్యలో స్ట్రామ్ వాటర్ నిర్మించాలని, రాజీవ్ గాంధీ నగర్ సీ బ్లాక్ వరకు భూగర్భ డ్రైనేజీ, అల్లాపూర్ సర్వే నెంబర్ 18లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, కుబాబ్ మసీదు నుంచి సర్వే నెంబర్ 18 వరకు స్ట్రామ్ వాటర్ డ్రెన్ నిర్మించాలని కోరారు. పద్మావతి నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై మేయర్ సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి చర్యలు

బాలానగర్: సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు ప్రతి డివిజన్‌లో పర్యటిస్తున్నానని జీహెచ్‌యంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ అన్నారు. బుధవారం ఆమె బాలానగర్ డివిజన్ పరిధిలో నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. నాలా రిటైనింగ్‌వాల్ నిర్మాణం చేపట్టాలని, ఫతేనగర్‌లో హిందు శ్మశాన వాటికకు వెళ్లేందుకు రోడ్డు, నాలాలో పూడిక తీత పనులను చేపట్టాలని స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. జీహెచ్‌యంసీ నుంచి ఎంటమాలజీ విభాగానికి చెందిన అధికారులు రాక పోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్, నాయకులు యుగంధర్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన..



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రూ.61.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్డి నేతృత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అదే విధంగా హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ఉదాసిన్ మఠం భూముల సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి గ్రామ పరిధిలో సుమారు 540 ఎకరాలకు పైగా ఉన్న ఉదాసిన్ మఠం భూముల పరిరక్షణకు అధికారులు సర్వే నిర్వహించారు. దేవాదాయ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కర్ర అనిత ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ తహశీల్దార్ విజయలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌లతో పాటు స్థానిక సర్వేయర్లు బుధవారం భూములను పరిశీలించారు. ఉదాసిన్ మఠం భూములకు చుట్టూ ఐడీఎల్ కంపెనీ భూములు, తెలంగాణ హౌసింగ్ బోర్డు భూములు, ప్రభుత్వ భూములు ఉండటంతో అన్ని వైపులా నిర్దిష్టమైన సర్వే పద్ధతులను అనుసరించి హద్దులను ఏర్పాటు చేయనున్నారు. దేవాదాయ శాఖ అధికారులు చూపిన సర్వే హద్దులను అనుసరించి మఠం భూములకు చుట్టూ ప్రహరీ నిర్మించనున్నారు.ఈ ప్రహరీ నిర్మాణానికి అయ్యే ఖర్చును మఠం ద్వారా చెల్లించనున్నారు. ఇప్పటికే మఠం భూములు కొంత మేర కబ్జాకు గురయ్యాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ సర్వేకు ప్రాధాన్యత నెలకొంది. సర్వే విషయం తెలుసుకున్న గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీ ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్ కాలనీ కమిటీ కార్యాలయంలో వెంకట పాపయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సరం కేలండర్‌ను బుధవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, రాందాస్ గౌడ్, నరసింహులు, సత్యంరావు, మహేందర్‌రావు, నాగేశ్వరరావు, జీవన్‌రెడ్డి, వెంకటస్వామిగౌడ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊరెళితే పోలీసులకు సమాచారం అందించాలి



శ్రీనివాసరావు
కూకట్‌పల్లి ఏసీపీ

మూసాపేట: సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో చోరీలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజలు కూడా తమ కాలనీ, ఇళ్లు, పరిసరాల్లో సీసీ కెమెరాలను ఆన్ చేసుకుని వెళ్లాలని సూచించారు. పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలన్నారు. ఇంటికి తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ వేసుకోవాలని సూచించారు. ఊర్లకు వెళ్లేవారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచుకోవాలన్నారు. ఎక్కువ రోజులు వెళ్లేవారు పేపర్, పాల ప్యాకెట్‌లను వేయవద్దని చెప్పాలని, పని మనుషులు రోజూ వాకిలి ఊడ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకుని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలపాలన్నారు. తద్వారా పెట్రోలింగ్ వాహనాలు ఆయా ప్రాంతాల్లోని ఇళ్ల వద్ద నిఘా ఉంచుతాయన్నారు. కొత్త వ్యక్తులను గుర్తిస్తే 100కు డయల్ చేయాలని సూచించారు. ఊళ్లకు వెళ్లే ప్రజలు తమ వివరాలను వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో పోస్ట్ చేయవద్దని సూచించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న తిరుమల హోమ్స్ ప్రతినిధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని కుమ్మరి బస్తీ సమీపంలోని తిరుమల హోమ్స్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం ఆ ప్రాంతంలో పర్యటించిన ఆయన అక్కడ నెలకొన్న సమస్యలను తిరుమల హోమ్స్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. హోమ్స్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో చెత్తను దహనం చేస్తున్నందున దుర్వాసన వస్తుందని, కుక్కలు బెడద తీవ్రంగా ఉందని, స్వీపింగ్ చేయడం లేదని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ తక్షణమే జేసీబీని పిలిపించి తిరుమల హోమ్స్ వెనుక ఉన్న చెత్తను తొలగింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వీపింగ్ జరిగేలా చూస్తానని, కుక్కల విషయంలో జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుమల హోమ్స్ ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుమల హోమ్స్ బ్లాక్ 2 అధ్యక్షులు వేణుగోపాల్, కార్యదర్శి నితీష్, జుబారి, సుజన్, దీపక్, సునీల్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం



సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ బలహీనవర్గాల ప్రజలకు చేయూతనందించడంతో పాటు, జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించడమే కాకుండా సమస్యలపై చర్చించడానికి కాకుండా పరిష్కరించడానికి సమావేశాలు దోహదపడాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు.

◆ బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ( దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రిరాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, అరికెపూడి గాంధి, మెంబరు సెక్రటరీ జిల్లా కలెక్టరు గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ శాఖల వారీగా కేంద్ర, రాష్ట్ర పథకాల అమలును, పురోగతిపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అనే వ్యత్యాసం చూపకుండా ప్రజలకు సత్ఫలితాలు చేకూరేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రశాంత్, పంచాయతీ రాజ్ ఈఈ వేణుగోపాల్, సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత తదితరులు పథకాల పురోగతిపై నివేదికలను ప్రవేశపెట్టారు.

### డీఆర్‌సీ సమావేశాలు మళ్లీ నిర్వహించాలి

రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయిస్తే ,రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో (దిశ) సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైల్వేల అభివృద్ధికి కేటాయించిన నిధులు కంటే రెట్టింపులో ఈ పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు సంబంధించి గతంలో రైల్వే పనులకు మాత్రమే కేంద్రం నిధులు విడుదలయ్యేవని, మోదీ ప్రభుత్వం హయాంలో 100 శాతం నిధులు అందజేస్తుందన్నారు. చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను కేంద్ర ప్రభుత్వం రూ.410 కోట్లతో అద్భుతంగా నిర్మించిందన్నారు. తెలంగాణలో 45 రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే రూ.2 వేల కోట్లతో సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ సంపద గణనీయంగా పెరిగిందన్నారు. రూ.4 లక్షల కోట్లతో యువతకు ఉపాధి కల్పన ,ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. దిశ సమావేశాలతో ప్రజా సమస్యలు చర్చకు రావటంతోపాటు పరిష్కారమవుతాయన్నారు. అందుకే మళ్లీ డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ నేతలు పటోళ్ల విక్రం రెడ్డి .చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.